




వన్డే ప్రపంచకప్

# వేట షురూ..

**తొలి పోరులో భారత్ జయభేరి • ఆరు వికెట్లతో ఆసీస్ చిత్తు • తిప్పేసిన జడ్డూ, కుల్దీప్ • కోహ్లీ, రాహుల్ మెరుపులు**

వన్డే వరల్డ్‌కప్‌లో టీమ్ ఇండియా తొలి విఘ్నాన్ని అధిగమించింది. ఐసీసీ టోర్నీల్లో కొరుకుడు పడని కంగారూలపై మనవాళ్లు సంపూర్ణ ఆధిపత్యం కనబర్చారు!

మొదట బౌలర్లు రాణించి ఆసీస్‌ను రెండొందల లోపే కట్టడి చేస్తే.. ఛేదనలో రెండు పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన స్థితిలో.. కోహ్లీ, రాహుల్ చక్కటి ఇన్నింగ్స్‌లతో మ్యాచ్‌ను మన వశం చేశారు!!

చెన్నై చెపాక్ పిచ్‌పై జడేజా, అశ్విన్‌ను ఎదుర్కోవడం ఎంత కష్టమో కంగారూలకు తెలిసి రాగా.. పుష్కరకాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న ప్రపంచకప్‌లో భారత్ ఘనంగా బోణీ కొట్టింది.




చెన్నై: స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయాల వేట ప్రారంభించింది. లీగ్ దశలో భాగంగా ఆదివారం జరిగిన పోరులో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (46; 5 ఫోర్లు), డేవిడ్ వార్నర్ (41; 6 ఫోర్లు) రాణించగా.. మిషెల్ స్టార్క్ (28), మార్నస్ లబుషేన్ (27) కాస్త పోరాడారు. భారత బౌలర్లలో జడేజా 3, బుమ్రా, కుల్దీప్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. సిరాజ్, పాండ్యా, అశ్విన్ తలా ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 41.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (0), ఇషాన్ కిషన్ (0), శ్రేయస్ అయ్యర్ (0) సున్నాలు చుట్టగా.. కేఎల్ రాహుల్ (115 బంతుల్లో 97 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లీ (116 బంతుల్లో 85; 6 ఫోర్లు) విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజిల్‌వుడ్ మూడు వికెట్లు తీశాడు. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### స్పిన్నర్ల హవా..

వరల్డ్‌కప్ మాట వింటే చాలు పూనకం వచ్చినట్లు రెచ్చిపోయే కంగారూలకు మన స్పిన్నర్లు ముకుతాడు వేశారు. ఈ పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే ఎక్కువ విజయాలు సాధించిన నేపథ్యంలో కమిన్స్ టాస్ గెలవగానే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో కోహ్లీ పట్టిన కండ్లు చెదిరే క్యాచ్‌కు మార్ష్ (0) ఔట్ కాగా.. ఆ తర్వాత వార్నర్, స్మిత్ ఆసీస్‌ను ఆదుకున్నారు. వీరిద్దరితో పాటు లబుషేన్ కూడా రాణించడంతో ఒక దశలో ఆసీస్ 110/2తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే స్లో పిచ్‌పై తమ ప్రతాపం చూపిన అశ్విన్, జడేజా, కుల్దీప్ పరుగులు నియంత్రిస్తూ.. కంగారూలపై ఒత్తిడి పెంచారు. దీంతో ధాటిగా ఆడేందుకు యత్నించిన ఆసీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఆ జట్టు 89 పరుగుల తేడాలో చివరి 8 వికెట్లు చేజార్చుకుంది.

### కోహ్లీ ఉన్నాడు బాస్!

ఇన్నింగ్స్ విరామం అనంతరం తిరిగి అభిమానులు ఇంకా సీట్లలో కూర్చోక ముందే.. భారత్‌కు దెబ్బమీద దెబ్బ తగిలింది. ఇషాన్ తొలి ఓవర్‌లోనే ఔట్ కాగా.. రెండో ఓవర్‌లో డబుల్ స్ట్రోక్‌గా రోహిత్, శ్రేయస్ వెనుదిరిగారు. ఈ దశలో మ్యాచ్‌పై ఆసీస్ పట్టు బిగించినట్లే అనిపించింది. కానీ కోహ్లీ ఉన్నంత వరకు కంగారూలకు ఇబ్బంది తప్పదని ఆసీస్ మాజీ కెప్టెన్ క్లార్క్ అన్నట్లు.. విరాట్ తన పవర్ ఏంటో చాటాడు. పరిస్థితులు సవాలు విసురుతున్న సమయంలోనే తనలోని అసలు సిసలు పోరాట యోధుడిని తట్టిలేపే కోహ్లీ.. వికెట్ల మధ్య పరిగెడుతూనే 61 పరుగులు తీశాడంటే.. అతడి ఇన్నింగ్స్ విలువేంటో అర్థం చేసుకోవచ్చు!

## అతడే మన మూల విరాట్!

నాలుగు మ్యాచ్‌ల్లో పరుగులు సాధిస్తే చాలు.. కోహ్లీతో పోల్చేయడం! ఓ ఆర్నెళ్లు నిలకడగా రాణిస్తే చాలు ప్రిన్స్ అంటూ మోసేయడం అలవాటైపోయిన తరుణంలో తనను కింగ్ అని ఎందుకు పిలుస్తారో విరాట్ కోహ్లీ మరోసారి నిరూపించాడు. ఒత్తిడి కొండలా పెరిగిపోతున్న సమయంలో దాన్ని ఎలా చిత్తు చేయాలో కోహ్లీకి తెలిసినంత బాగా.. సమకాలిన క్రికెట్‌లో మరెవరికీ తెలియదనడంలో ఇసుమంత అతిశయోక్తి లేదు. పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగితే.. నడిపిస్తాడనుకున్న సారథి రోహిత్ శర్మ ఖాతా తెరవకుండానే వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మొనగాడు అనిపించుకున్న శ్రేయస్ అయ్యర్ సున్న చుట్టడంతో బ్యాట్ నుంచి ఒక్క పరుగూ రాకముందే.. భారత్ 3 వికెట్లు కోల్పోయింది. ఇలాంటి సమయంలో మరో ఆటగాడైతే కచ్చితంగా ఒత్తిడికి గురయ్యేవాడే! కానీ అక్కడ ఉన్నది రన్‌మెషీన్, పరుగుల రారాజు విరాట్ కోహ్లీ అని కంగారూలకు తెలిసి రావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా రాణించాలో.. ప్రత్యర్థులు ఆధిపత్యం ప్రదర్శిస్తున్న సమయంలో ఎలా నిలదొక్కుకోవాలో ఉగ్గుపాలతోనే నేర్చుకున్న కోహ్లీ.. చెన్నైలో మరోసారి తన విలువేంటో చాటుకున్నాడు. ఫ్రాంచైజీ క్రికెట్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో సత్తా చాటగానే టీమ్‌ఇండియాకు ఆడేయొచ్చు అనుకుంటున్న ప్లేయర్లకు విరాట్ అంటే ఏంటో ఈ ఇన్నింగ్స్ మరోసారి నిరూపించింది. గతంలో ఎన్నోసార్లు ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అవలీలగా ఎదుర్కొన్న కోహ్లీ.. అదే సంయమనం మరోసారి కనబర్చాడు. ఒక్కో పరుగుతో ఇన్నింగ్స్‌ను ఎలా నిర్మించాలో.. చాపకింద నీరులా స్కోరు బోర్డును ఎలా ముందుకు నడపాలో అక్షరాల ఆచరణలో చూపాడు. క్యాచ్ మిస్ కావడంతో ఊపిరి పీల్చుకున్న కోహ్లీ ఆ తర్వాత పెవిలియన్ చేరేంత వరకు ఒక్క లూజ్ షాట్ కూడా ఆడలేదంటే.. అతడు తన వికెట్‌కు ఇచ్చిన విలువేంటో అర్థం చేసుకోవచ్చు. వన్డే క్రికెట్‌లో స్ట్రయిక్ రొటేషన్ ఎంత ముఖ్యమో చాటిన కోహ్లీ.. రాహుల్‌కు దిశానిర్దేశం చేస్తూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత స్కోరు బోర్డు చూసిన వాళ్లకు కోహ్లీ కంటే రాహుల్ ఎక్కువ పరుగులు చేసినట్లు కనిపించినా.. అసలు సిసలు క్రీడాభిమానులను అడిగితే తెలుస్తుంది విరాట్ ఇన్నింగ్స్ విలువేంటో!

*-నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

### సంక్షిప్త స్కోర్లు

**ఆస్ట్రేలియా:** 49.3 ఓవర్లలో 199 (స్మిత్ 46, వార్నర్ 41; జడేజా 3/28, బుమ్రా 2/35), **భారత్:** 41.2 ఓవర్లలో 201/4 (కోహ్లీ 85, రాహుల్ 97*; హాజిల్‌వుడ్ 3/38).

### ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 1 | 1 | 0 | +2.14 | 2 |
| దక్షిణాఫ్రికా | 1 | 1 | 0 | +2.04 | 2 |
| పాకిస్థాన్ | 1 | 1 | 0 | +1.62 | 2 |
| బంగ్లాదేశ్ | 1 | 1 | 0 | +1.43 | 2 |
| భారత్ | 1 | 1 | 0 | +0.88 | 2 |
| ఆస్ట్రేలియా | 1 | 0 | 1 | −0.88 | 0 |
| అఫ్గానిస్థాన్ | 1 | 0 | 1 | −1.43 | 0 |
| నెదర్లాండ్స్ | 1 | 0 | 1 | −1.62 | 0 |
| శ్రీలంక | 1 | 0 | 1 | −2.04 | 0 |
| ఇంగ్లండ్ | 1 | 0 | 1 | −2.14 | 0 |

నోట్: దే:దేశం, ఆ: ఆడినవి, గె:గెలిచినవి, ఓ:ఓడినవి, ర:రన్‌రేట్, పా: పాయింట్లు

## రషీద్ ఖాన్ ఔదార్యం



ధర్మశాల: అఫ్గానిస్థాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్ బంతి అందుకోవడమే ఆలస్యం ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పతిప్పలు పెడుతుంటాడు. ఈసారి అఫ్గానిస్థాన్ జట్టు ఈ స్పిన్ ఆల్‌రౌండర్‌పై భారీ అంచనాలే పెట్టుకుంది. బ్యాటర్లకు కొరకరాని కొయ్యగా మారిన రషీద్ తాజాగా తన ఔదార్యంతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్నాడు. ఇంతకు ఏం చేశాడంటే.. తమదేశంలో భూకంపం ధాటికి ఆత్మీయులను, సర్వస్వాన్ని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగిన ప్రజలను చూసి చలించిన రషీద్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌ల ఫీజు రూపంలో తనకు వచ్చే మొత్తం ఆదాయాన్ని భూకంప బాధితులకు విరాళంగా ఇస్తున్నట్టు ఆదివారం ప్రకటించాడు. ఈ ఘోర ప్రకృతి విపత్తు కారణంగా రోడ్డున పడినవాళ్లను ఆదుకునేందుకు త్వరలోనే నిధులు సేకరణ చేపడతానని రషీద్ పేర్కొన్నాడు. అఫ్గానిస్థాన్ పశ్చిమ ప్రాంతాలు హెరాత్, ఫరాహ్, బద్గీస్‌లో భూకంపం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని తెలిసింది. అందుకని బాధితుల కోసం వరల్డ్ కప్‌లో నా మ్యాచ్ ఫీజును విరాళంగా ప్రకటిస్తున్నా. కష్టాల్లో ఉన్న నా దేశ ప్రజలకు అండగా నిలిచేందుకు మరి కొందరితో కలిసి త్వరలోనే నిధులు సేకరిస్తా అని రషీద్ ట్వీట్ చేశాడు.

## 29 బంతుల్లోనే సెంచరీ

**• డివిలియర్స్ రికార్డు బద్దలు**

అడిలైడ్: దక్షిణాఫ్రికా యువ ఆటగాడు ఫ్రెజర్ లిస్ట్-ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ (29 బంతుల్లో) నమోదు చేసుకున్నాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న రికార్డును ఫ్రెజర్ తిరగరాశాడు. డివిలియర్స్ అంతర్జాతీయ స్థాయిలో వెస్టిండీస్‌పై 31 బంతుల్లో సెంచరీ చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ కాగా.. లిస్ట్-ఏలో ఫ్రెజర్ నయా రికార్డు నెలకొల్పాడు. దక్షిణాఫ్రికా దేశవాళీ టోర్నీలో టాస్మానియాతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణ ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఫ్రెజర్ (38 బంతుల్లో 125; 10 ఫోర్లు, 13 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు.



సెర్బియాలో జరిగిన సీఎమ్‌ఏఎస్ ఓపెన్ వాటర్ ఫిన్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన క్వీన్ విక్టోరియాను ఆదివారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## నెదర్లాండ్స్ x న్యూజిలాండ్

**ఉప్పల్‌లో వరల్డ్‌కప్ మ్యాచ్ • మధ్యాహ్నం 2 నుంచి..**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో మరో మ్యాచ్ ఆతిథ్యానికి హైదరాబాద్ సిద్ధమైంది. మెగాటోర్నీలో భాగంగా సోమవారం నెదర్లాండ్స్, న్యూజిలాండ్ మధ్య ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో మ్యాచ్ జరుగనుంది. టోర్నీ ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై ఘనవిజయం సాధించిన న్యూజిలాండ్ సమరోత్సాహంలో ఉంటే.. పాకిస్థాన్‌తో ఉప్పల్‌లోనే ఆడిన తొలి మ్యాచ్‌లో చక్కటి పోరాటంతో ఆకట్టుకున్న నెదర్లాండ్స్ మరోసారి సేమ్ సీన్ రిపీట్ చేయాలని చూస్తున్నది. వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టు నిర్దేశించిన 283 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ టీమ్ కేవలం 36.2 ఓవర్లలోనే ఛేదించి ప్రత్యర్థులకు ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా.. న్యూజిలాండ్ రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ పూర్తి స్థాయిలో కోలుకోపోవడంతో ఈ మ్యాచ్ బరిలోకి దిగడం అనుమానంగా కనిపిస్తున్నది. అతడి గైర్హాజరీలో వికెట్ కీపర్ టామ్ లాథమ జట్టుకు సారథ్యం వహించనున్నాడు.

# హాంగ్జౌకు బైబై



- **ఆసియా గేమ్స్‌కు ఘనంగా వీడ్కోలు**
- **వెలుగు, జిలుగుల మధ్య ముగింపు వేడుకలు**


హాంగ్జౌ: పదిహేను రోజుల పాటు అభిమానులను అలరించిన ఆసియాగేమ్స్‌కు ఆదివారం తెరపడింది. నభూతో నభవిష్యత్ అన్న రీతిలో గతానికి పూర్తి భిన్నంగా జరిగిన ఆసియాగేమ్స్ క్రీడాభిమానుల మదిలో కలకాలం గుర్తుండిపోనుంది. ఆసియా ఖండంలోని 45 దేశాలకు చెందిన 12వేలకు మంది అథ్లెట్లు పోటీపడ్డ మెగాటోర్నీలో ఆరంభ వేడుకులకు ఏ మాత్రం తగ్గకుండా ముగింపు కార్యక్రమాన్ని జిల్‌జిల్ జిగేల్ అనే రీతిలో నిర్వహించారు. చైనా దేశ సంస్కృతిని, వారసత్వానికి అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ మరో లోకంలోకి తీసుకెళ్లాయి. 75 నిమిషాల పాటు బిగ్ లోటస్ స్టేడియంలో వేలాది మంది ప్రేక్షకులు, అథ్లెట్ల సమక్షంలో జరిగిన ముగింపు ఉత్సవాలు అందరినీ మైమరిపించాయి. ముఖ్యంగా హాంగ్జౌ జ్ఞాపకాల అనే థీమ్‌తో పాటు వెయ్యి ఏండ్ల తమ దేశ వారసత్వానికి ప్రతీకగా 'లోటస్ అండ్ ఒస్మాంతస్' కనులకు ఇంపుగా జరిగాయి. కరోనా వైరస్ విజృంభణ కారణంగా ఏడాది ఆలస్యంగా జరిగిన హాంగ్జౌ ఆసియాగేమ్స్‌లో అంచనాలకు మించి ఫలితాలు నమోదయ్యాయి. భారత్(28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు) నాలుగో స్థానంలో నిలిచింది. భారత సీనియర్ హాకీ ప్లేయర్ పీఆర్ శ్రీజేష్ జాతీయ పతాకధారిగా వ్యవహరించగా, దాదాపు 100 మంది అథ్లెట్లు మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. ఆసియా ఒలింపిక్ కౌన్సిల్(వోసీఏ) తాత్కాలిక అధ్యక్షుడు రణధీర్‌సింగ్ 19వ ఆసియాగేమ్స్ ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. 2026లో ఐచీ-నగోయా(జపాన్) ఆసియా క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది.



శ్రీజేష్

### ఇదే స్ఫూర్తితో..

హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత ప్లేయర్లు అంచనాలకు మించి రాణించారు. 70 ఏండ్ల సుదీర్ఘ ఆసియా క్రీడల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించి ఔరా అనిపించారు. గత రికార్డులను తిరుగరాస్తూ కొత్త చరిత్ర లిఖించారు. ఇస్ బార్ సౌ పార్ అన్న నినాదాన్ని అనుగుణంగా ఆది నుంచే తాము పోటీకి దిగిన ప్రతీ విభాగంలో సత్తాచాటారు. అథ్లెటిక్స్, షూటింగ్ లాంటి విభాగాల్లో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ పతకాల పంట పండించారు. ఈ క్రమంలో గత రికార్డులను తిరుగరాస్తూ పతకాలు ఒడిసిపట్టుకున్నారు. షూటింగ్‌లో మన రాష్ట్ర యువ షూటర్ ఇషాసింగ్ స్వర్ణం సహా మూడు రజత పతకాలతో మెరువగా, బాక్సర్ నిఖత్ జరీన్ కాంస్యాన్ని ముద్దాడింది. హెప్టాథ్లాన్‌లో ఎస్సీ గురుకుల మణిపూస అగసర నందిని కాంస్య పతకంతో నయా చరిత్ర లిఖించింది. క్రికెట్‌లో తిలక్ వర్మ, ట్రాప్ షూటింగ్‌లో కైనాన్ చినాయ్ పతకాలతో ప్రతిభ చాటారు. మొత్తంగా హాంగ్జౌ స్ఫూర్తితో రానున్న పారిస్ ఒలింపిక్స్‌లో పతకాల వేట కొనసాగించాలని ఆశిద్దాం.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.